క్లుప్తంగా

పరవాడ తహసీల్దార్‌గా కనకారావు



పరవాడ: పరవాడ తహసీల్దార్‌గా పి.కనకారావును నియమిస్తూ అనకాపల్లి జిల్లా కలెక్టర్ రవిపట్టాన్‌శెట్టి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ తహసీల్దార్ వి.ప్రకాశరావును మునగపాక తహసీల్దార్‌గా బదిలీ చేశారు. పరవాడ తహసీల్దార్‌గా కనకారావు గురువారం బాధ్యతలు స్వీకరించే అవకాశాలు ఉన్నాయని తెలిసింది.

ఉమాచంద్రమౌళీశ్వరుడికి విశేషంగా అభిషేకాలు



ఉమాచంద్రమౌళీశ్వర స్వామి

సింహాచలం: అడవివరం దరి విజినిగిరిపాలెంలోని ఉమా చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో సోమవారం పరమేశ్వరుడికి విశేషంగా అభిషేకాలు, పూజలు నిర్వహించారు. భక్తులు భారీగా తరలి వచ్చి స్వామిని దర్శించుకున్నారు. బిల్వపత్రాలతో పూజలు చేశారు. ఉమాదేవి అమ్మవారికి కుంకుమ పూజలు వైభవంగా నిర్వహించారు. పలురకాల పుష్పాలతో స్వామిని విశేషంగా అలంకరించారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కృష్ణశర్మ ఆధ్వర్యంలో పూజలు జరిగాయి.

అక్రమంగా తవ్విన చెరువు మూసేయాలని నిరసన



నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు, రైతులు

పరవాడ: తానాం సమీపంలో రాంకీ యాజమాన్యం అక్రమంగా తవ్విన చెరువును తక్షణమే మూసివేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం చెరువు వద్ద ఆందోళన నిర్వహించారు. అనంతరం గనిశెట్టి మాట్లాడుతూ పర్యావరణాన్ని నాశనం చేస్తూ గ్రీన్‌బెల్ట్ ప్రాంతంలో చెరువు తవ్వి ఫార్మా వ్యర్థ రసాయనాలను నిల్వ చేయాలని చూస్తుందన్నారు. కాలుష్య నియంత్రణ మండలి అధికారులు స్పందించి వెంటనే మూసివేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో భారీ ఎత్తున ఆందోళన చేపడతామని గనిశెట్టి హెచ్చరించారు. కార్యక్రమంలో పరిసర గ్రామాల రైతులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టులభర్తీకి నోటిఫికేషన్

సబ్బవరం: సబ్బవరం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్తల పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో లలిత్ కుమారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్బవరం, పరవాడ మండలంలోని ఖాళీగా ఉన్న రెండు పోస్టులు భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. పరవాడ మండలంలోని తానాం అంగనవాడీ-2 కార్యకర్త (ఎస్సీ), సబ్బవరం మండలంలోని అయ్యన్నపాలెం శివారు కిల్లివానిపాలెం మినీ అంగన్‌వాడీ పోస్టు (ఓసీ)కి కేటాయించినట్టు తెలిపారు. పదోతరగతి ఉత్తీర్ణత సాధించడంతో పాటు 01-07-2023 నాటికి 21 ఏళ్లు నిండాలని పేర్కొన్నారు. ఈ నెల 12వ తేదీలోగా అర్హత కలిగిన వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

అతిథి అధ్యాపక పోస్టు భర్తీకి దరఖాస్తులు

సబ్బవరం: సబ్బవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న అతిథి అధ్యాపక పోస్టు భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ బి. సీతాలక్ష్మి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పొలిటికల్ సైన్స్ సబ్జెక్టును ఆంగ్ల మాధ్యమంలో బోధించాలని పేర్కొన్నారు. సంబంధిత సబ్జెక్టులో పోస్టు గ్రాడ్యుయేషన్‌లో 55 శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలన్నారు.నెట్/స్లెట్/పీహెచ్‌డీ కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అర్హులైన అభ్యర్థులు వారి విద్యార్హత, బోధన అనుభవంతో పాటు ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు ఒక జెరాక్సుసెట్‌తో డెమో క్లాసులు నిర్వహించడానికి ఈ నెల 7వ తేదీ ఉదయం 10 గంటలకు హాజరు కావాలన్నారు.

ఏఎంహెచ్‌వోగా సునీల్‌కుమార్

కంచరపాలెం: జోన్-5 పబ్లిక్ హెల్త్ ఏఎంహెచ్‌వోగా డాక్టర్ ఎ.సునీల్‌కుమార్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా సోమవారం జోనల్ కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణను సునీల్‌కుమార్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

పర్యావరణ పరిరక్షణ.. అందరి బాధ్యత

- ప్లాస్టిక్ భూతానికి చెక్ పెట్టాలని అతిథుల పిలుపు
- ఘనంగా పర్యావరణ దినోత్సవం



పరవాడలో మొక్క నాటుతున్న సర్పంచ్ అప్పలనాయుడు, అధికారులు



ర్యాలీ నిర్వహిస్తున్న హెచ్‌ఎం పైడిరాజు, సైన్స్ అధికారులు

పరవాడ: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని సోమవారం ఫార్మా పరిశ్రమలతో పాటు పెందుర్తి, పరవాడ, సబ్బవరం మండలాల్లో ఘనంగా నిర్వహించారు. పర్యావరణ ఆవశ్యకతను వివరిస్తూ అవగాహన ర్యాలీలు చేపట్టారు. ప్లాస్టిక్ వినియోగానికి చెక్ పెట్టాలని.. మొక్కలు విస్తృతంగా పెంచాలని నినదించారు. పలు గ్రామాల్లో మొక్కలు నాటారు.

- పరవాడలో సర్పంచ్ సిరపరపు అప్పలనాయుడు మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ పద్మజ, కార్యదర్శి అచ్యుతరావు, ఉపసర్పంచ్ బి.రామారావు పాల్గొన్నారు.
- ఈ. బోనంగిలో సర్పంచ్ బొద్దపు శ్రీనివాసరావు మొక్కలు నాటారు. జీవకోటి మనుగడ సాగించడానికి చెట్లు నాటే కార్యక్రమాన్ని ఉద్యమ స్ఫూర్తితో కొనసాగించడానికి ముందుకు రావాలని శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. మంత్రి గిరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.
- గొర్లివానిపాలెం గ్రామ సచివాలయంలో సర్పంచ్ గొర్లి అమ్మలు మొక్కలు నాటారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు గొర్లి గోపి, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.
- జేఎన్ ఫార్మాసిటీలో ఎస్ఎన్ఎఫ్ ఇండియా పరిశ్రమలో ఆ సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కె.రాజేంద్రన్ మొక్కలు నాటారు. పరిశ్రమ ఆవరణలో ఉద్యోగులు 200 మొక్కలు నాటారు. ప్లాస్టిక్ సంచులు నివారించేందుకు వీలుగా యాజమాన్యం ఉద్యోగులకు 500 జ్యూట్ బ్యాగులు పంపిణీ చేసింది.



ఈ. బోనంగిలో ప్రతిజ్ఞ చేస్తున్న సర్పంచ్, సచివాలయ ఉద్యోగులు

- రాంకీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. వేడుకల్లో పాల్గొన్న రాంకీ ఎండీ పి.లాల్‌కృష్ణ మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకం తగ్గడం లేదని దీని వలన పర్యావరణం ప్రమాదంలో పడిందన్నారు. మానవ ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించడానికి ప్రతి ఒక్కరు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో భాగంగా చిన్నారులకు పర్యావరణంపై చిత్రలేఖనం పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫార్మాసిటి డైరెక్టర్ పి.ఈశ్వర్‌రెడ్డి, ప్రతినిధులు చంద్రశేఖర్, చక్రిదర్, గిరిధర్‌బక్షి, శ్రీకాంత్ పాల్గొన్నారు.

వాడవాడలా ఘనంగా పర్యావరణ దినోత్సవం

సింహాచలం: ప్రతీ ఒక్కరు మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం వార్డు పరిధిలోని ఆర్టీసీ లేఅవుట్ పార్కులో మొక్కలు నాటారు. ఆయన మట్లాడుతూ కాలుష్య నివారణకు మొక్కలు నాటి వాటిని సంరక్షించడమే తొలి కర్తవ్యంగా అందరూ భావించాలన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు పి.చినబాబు, లక్ష్మి, సన్యాసిరావు, సత్యనారాయణ, అనురాధ, పద్మ,వరూధిని, ప్రసన్న, వెంకటేష్ పాల్గొన్నారు.

- అడవివరం గ్రంథాలయంలో పర్యావరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు కూఎస్ఆర్ మూర్తి విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణపై పిల్లలకు అవగాహన కల్పించారు. ప్రతీ ఒక్కరూ ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలని సూచించారు. కార్యక్రమంలో గ్రంథాలయ రీడర్స్ ఫోరమ్ కమిటీ అధ్యక్షుడు బి.బి.రాజేంద్రప్రసాద్, రిసోర్స్ పర్సన్ జి.కిరణ్‌కాంత్, గ్రంథాలయాధికారి ఎస్.వి.నరసింహం పాల్గొన్నారు.



మొక్క నాటుతున్న 95వవార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు



మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ర్యాలీ

- పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని పెందుర్తి మహిళా సమాఖ్య కార్యాలయంలో అధ్యక్షురాలు గుమ్మడి జ్యోతి ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ప్రతీ ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని ప్రతిజ్ఞ చేశారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీఎం బి.వి.రమణ, వీవోలు పాల్గొన్నారు.
- ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో విశాఖ రీసెర్చ్ రేంజర్ ఉమామహేశ్వరి మొక్కలు నాటారు. ఆమె మాట్లాడుతూ మండలంలో అన్ని పంచాయతీల పరిధిలో విరివిగా మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టాలన్నారు. ఒక్క రోజే 500 మొక్కలు నాటామని ఎంపీడీవో వి.హేమసుందరావు చెప్పారు.
- ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని సింహాద్రి ప్రాజెక్టు హెడ్ సంజయ్‌కుమార్ సిన్హాను విశాఖ కలెక్టర్ మల్లికార్జున ఘనంగా సత్కరించారు. ఆటవీ శాఖ ఆధ్వర్యంలో విశాఖలో గో గ్రీన్, బ్రీత్ క్లీన్ కార్యక్రమంలో ఎన్టీపీసీ అందించిన సహకారం అభినందనీయమని కలెక్టర్ ప్రశంసించారు. దీంతో పాటు ఆలీవ్ రిడ్లే తాబేళ్ల పెంపకం, అనంతగిరి కమ్యూనిటీ బెస్ట్ ఇకోటూరిజం ప్రాజెక్టు అభివృద్ధికి చేసిన కృషిని గుర్తించి సిన్హాను సన్మానించారు.



గొర్లివానిపాలెంలో మొక్క నాటుతున్న సర్పంచ్ గొర్లి గోపీ అమ్మలు



చిన్నారులకు బహుమతులు అందజేస్తున్న రాంకీ ఎండీ లాల్‌కృష్ణ

జెడ్పీ పాఠశాలలో..

సింహాచలం: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని అడవివరం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో సోమవారం ఘనంగా నిర్వహించారు. పర్యావరణాన్ని పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని, కాలుష్యం బారి నుంచి మనల్ని మనం కాపాడుకోవాలని ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో 98వ వార్డు కార్పొరేటర్ పి.వి.నరసింహం, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఇమంది పైడిరాజు, ఎస్ఎస్ఏ ఏపీసీ శ్రీనివాస్, ఏపీవో అప్పలనాయుడు, పాఠశాల కమిటీ సభ్యులు అప్పలరాజు, ఆనంద్, నాయుడు, జిల్లా సైన్స్ అధికారులు సూరెడ్డి బాబూరావు, విశ్వేశ్వరరావు, మురళీ పాల్గొన్నారు.

సబ్బవరం మండలంలో..

సబ్బవరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బోకం సూర్యకుమారి మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు బోకం రామునాయుడు, ఏవో ఎస్. బాబూరావు, ఎంపీటీసీ కర్రి అప్పారావు, ఏఈ అర్జున అప్పారావు, ఏవో పోతల సత్యనారాయణ, ఏపీవో శ్రీనివాసరావు పాల్గొన్నారు.

- అమృతపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఎంఈవో ఎస్. అప్పలరాజు, ప్రధానోపాధ్యాయుడు రామునాయుడు మొక్కలు నాటారు.
- అంతకాపల్లి సచివాలయం,జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సర్పంచ్ సబ్బవరపు నారాయణమూర్తి మొక్కలు నాటారు.



అంతకాపల్లిలో మొక్క నాటుతున్న సర్పంచ్ నారాయణమూర్తి తదితరులు



మండల పరిషత్ ఆవరణలో మొక్కకు నీరుపెడుతున్న ఎంపీపీ సూర్యకుమారి



అడవివరం గ్రంథాలయంలో ..



మండల పరిషత్ కార్యాలయంలో మొక్క నాటుతున్న ఉమామహేశ్వరి



జ్యూట్ బ్యాగులతో ఎస్ఎన్ఎఫ్ ఇండియా ఉద్యోగులు

కూరగాయల పాకలు దగ్ధం

చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు

సబ్బవరం: మండలంలోని చిన్నయ్యపాలెం వద్ద జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న సంత స్థలంలో రైతులకు చెందిన కూరగాయాల పాకలను ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు దగ్ధం చేశారు. దీనిపై సమగ్ర దర్యాప్తు చేసి కఠిన చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని రైతులు, వ్యాపారులు బోకం దేముడమ్మ, కృష్ణ, గేదెల పార్వతి, ఎడ్ల దేముడమ్మ, గండి రమణమ్మ,జి. లక్ష్మి తదితరులు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 30 ఏళ్లుగా చిన్నయ్యపాలెం వద్ద కూరగాయాలు క్రయ విక్రయాలు చేస్తున్నామన్నారు. ఇటీవల జాతీయ రహదారి విస్తరణలో సంత స్థలం పూర్తిగా రోడ్డు నిర్మాణంలోకి పోయిందన్నారు. దీంతో సమీపంలోనే జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న అమృతపురం రెవెన్యూ పరిధిలోని తవ్వవానిపాలేనికి చెందిన పుచ్చవానిచెరువు ఖాళీ స్థలంలో పాకలు వేసుకుని కూరగాయలు అమ్ముకుంటున్నామన్నారు.



దగ్ధమైన కూరగాయల పాక వద్ద రైతులు, వ్యాపారులు

ఈ నేపథ్యంలో ఆదివారం రాత్రి తమ పాకలకు నిప్పుపెట్టారని ఆవేదన వ్యక్తం చేసారు. అయితే ఇటీవల కొన్ని రోజులుగా అప్పలనాయుడు అనే వ్యక్తి తమకు ఫోన్లు చేసి పాకలు ఖాళీ చేయాలని బెదిరిస్తున్నారని ఆరోపించారు. దర్యాప్తు చేసి నిప్పు పెట్టినవారిపై చర్యలు తీసుకొని, తమకు న్యాయం చేయాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫిర్యాదు చేసినవారిలో గుండె బంగారయ్య, వడినల భారతి, నాగుల బంగారయ్య, చింతల ఉమారాజ్యలక్ష్మి, లగుడు దేముడు బాబు తదితరులు ఉన్నారు.

కిడ్నీ రోగి లోకేష్‌కి మందుల వితరణ



బాలుడికి మందులు అందజేస్తున్న దాడి శ్రీను తదితరులు

సింహాచలం: సాయి హెల్పింగ్ హ్యాండ్స్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చీమలాపల్లికి చెందిన గొట్టివాడ లోకేష్ అనే బాలుడికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. లోకేష్ కిడ్నీ వ్యాధితో బాధపడుతుండడంతో అతడికి చేదోడుగా నిలవాలని సాయి హెల్పింగ్ హ్యాండ్స్ చారిటబుల్ ట్రస్ట్ అధినేత దాడి శ్రీను పూనుకున్నారు. లోకేష్‌కి 14 ఏళ్లు వచ్చే వరకు నెలవారీ మందులు ఉచితంగా అందిస్తామని తెలిపారు. దీంతో లోకేష్ తల్లిదండ్రులు శ్రీను, సునీత సంతోషం వ్యక్తం చేశారు. దాడి శ్రీనుకి కృతజ్ఞతలు తెలిపారు.

నేడు ముత్యమాంబ పండగ

విస్తృత ఏర్పాట్లు చేసిన నిర్వాహకులు



గ్రామ దేవత ముత్యమాంబ

పరవాడ: గంగపుత్రులు ఆరాధ్యదైవంగా కొలిచే శ్రీ ముత్యమాంబ పండగను మంగళవారం అత్యంత వైభవంగా నిర్వహించడానికి ఉత్సవ కమిటీ విస్తృత ఏర్పాట్లు చేసింది. అమ్మవారి మహోత్సవం పురస్కరించుకొని అమ్మవారి ఆలయాన్ని రంగు రంగుల విద్యుత్ తోరణాలు, పుష్పాలతో అలంకరించారు. పురవీధులు విద్యుత్ కాంతులతో మెరిసిపోతున్నాయి. మంగళవారం వేకువ జాము నుంచి అమ్మవారిని దర్శించుకోవడానికి భక్తులు తరలిరానున్న నేపథ్యంలో ఆలయ ప్రాంగణంలో షామియనాలు, బారికేడ్లు ఏర్పాటు చేశారు. భక్తులకు ఉచిత ప్రసాదం, మంచినీరు, మజ్జిగ వంటి పానీయాలు అందించడానికి పలు స్వచ్ఛంద సంస్థలు సిద్ధమయ్యాయి. రాత్రికి డప్పులు, చిడతలు, తప్పెటగుళ్ల, మేళ తాళాలు, డ్యాన్సులతో అమ్మవారిని పురవీధుల్లో ఊరేగిస్తారు. అనంతరం ఆలయానికి తోడ్కొనివచ్చి భారీ బాణ సంచా కాల్పుల నడుమ అనుపోత్సవాన్ని వైభవంగా నిర్వహిస్తారు. ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్టు ఉత్సవ కమిటీ తెలిపింది.

భారీ పోలీసు బందోబస్తు

ముత్యమాంబ జాతరను పురస్కరించుకొని గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశాం. అల్లర్లకు తావులేకుండా పండగ ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి. దీనిపై ఉత్సవ కమిటీకి సూచనలిచ్చాం. పోలీసు యంత్రాంగానికి ప్రజలు సహకరించాలి.

– పి.ఈశ్వరరావు, సీఐ, పరవాడ

అప్పన్నకు విశేషంగా నిత్యకల్యాణం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకు కల్యాణం అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు. అర్చకులు రఘునాథ్, శ్రీకాంత్ తదితరులు కార్యక్రమాన్ని నిర్వహించారు.



యజ్ఞోపవీతం ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

అప్పన్న సన్నిధిలో నిర్మలానందనాథ స్వామీజీ



కప్ప స్తంభానికి మొక్కు కుంటున్న నిర్మలా నందనాథ మహా స్వామీజీ

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి సోమవారం కర్ణాటకలోని ఆదిచుంచనగిరి మహాసంస్థాన్ అధ్యక్షుడు డాక్టర్ నిర్మలానందనాథ మహాస్వామీజీ దర్శించుకున్నారు. ఆలయంలోని కప్ప స్తంభానికి మొక్కుకున్నారు. ఆలయ బేడా మండపంలో ప్రదక్షిణ చేశారు. ఆయన పేరిట అర్చకులు స్వామికి పూజలు చేసి వేద ఆశీర్వచనం ఇచ్చారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదాన్ని టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కనకరాజు అందజేశారు. అడవివరం మాజీ సర్పంచ్ పొశర్ల ప్రసాద్‌స్వామీజీ వెంట ఉన్నారు.

భండాసురుని సంహారానికే లలితాదేవి అవతారం



అనుగ్రహ భాషణం చేస్తున్న శ్రీసిద్ధేశ్వరానంద మహాస్వామి



హాజరైన పండితులు, సాహితీ వేత్తలు

సీతంపేట: భండాసురుని సంహారం కోసం లలితాదేవి అవతరించిందని కుర్తాళం శంకరాచార్య, లలితా పీఠాధిపతి శ్రీసిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి అన్నారు. పీఠం దర్బారు హాల్లో దశ మహావిద్యల్లో భాగంగా రెండో రోజు లలితా వైభవంపై అనుగ్రహ భాషణం చేశారు. యుద్ధం లేకుండా భండాసురుడు అన్ని లోకాల్లో కామ ప్రళయాన్ని సృష్టించాడన్నారు. దేవతలందరూ శ్రీమహావిష్ణువుని ప్రార్థించగా శంభుదేవుడి సూచనతో చేసిన మహా యజ్ఞం నుంచి లలితాదేవి ఆవిర్భవించి భండాసురుని సంహరించిందని తెలిపారు. లలితాదేవి చేసిన యుద్ధంలో మహిళా సైన్యం పాల్గొన్నదని చెబుతూ వివిధ అస్త్రాల విశేషాలను వివరించారు. లలితా సహస్ర నామం అమ్మవారు భండాసురుని ఎలా సంహరించిందో చెబుతుందన్నారు. 16 అక్షరాలతో ప్రకాశించేది లలితా మంత్రమని, దేవతల్లోనూ అందరూ అమరులు కాదని, బృహస్పతి కుమారుడు కచుడు, శుక్రుని నుంచి మృత సంజీవని విద్యను సాధించిన కథను, లలితాదేవి అవతరించిన వైనాన్ని వివరించారు. ప్రవచనానికి ముందు నిర్వహించిన సంగీత విభావరి భక్తులను అలరించింది. కార్యక్రమంలో శక్తి పీఠాధీశ్వరి రమ్యానంద భారతీ స్వామిని, పెద్ద సంఖ్యలో సాహితీ వేత్తలు, పండితులు, భక్తులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా 'గడప గడపకు'..



వృద్ధుడితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్



క్రికెట్ కిట్ అందజేస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

సింహాచలం: ప్రజా సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించాలనే లక్ష్యంతో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ చెప్పారు. జీవీఎంసీ 97వ వార్డు 497 సచివాలయం పరిధిలోని సుజాతనగర్ జోన్,సప్తగిరి నగర్, అశ్విని నగర్‌లో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అదీప్‌రాజ్ ఇంటింటికీ వెళ్లి నాలుగేళ్లలో అందించిన సంక్షేమ పథకాలను గణాంకాలతో సహా వివరించారు. ప్రజలతో మాట్లాడి స్థానిక సమస్యలు తెలుసుకున్నారు. అర్హత ఉన్నా సాంకేతిక కారణాలతో ప్రభుత్వ పథకాలు అందక పోతే తమ దృష్టికి తేవాలన్నారు.

క్రికెట్ కిట్ అందజేత

యువత క్రీడల్లో రాణించాలని ఎమ్మెలే అదీప్‌రాజ్ ఆకాంక్షించారు. శేషగిరి నగర్ యువతకు ఆయన క్రికెట్ కిట్ అందజేశారు. కార్యక్రమంలో 97వ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు మెంతి మహేష్, నాయకులు డీఎస్ మూర్తి, రాంబాబు,ఈశ్వర్ రావు, రఘు,శేఖర్,సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు

పాత చలానాలు రద్దు చేయాలి

సీతమ్మధార: ఆటో డ్రైవర్లపై ఉన్న పాత చలానాలు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సోమ వారం దొండపర్తి సమీపంలోని శ్రీకన్య థియేట ర్ జంక్షన్‌లో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్క ర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వామనమూర్తి మాట్లాడుతూ జిల్లాలోని ఆటో డ్రైవర్లపై ఉన్న ఈ చలానాలు రద్దు చేయాలని, పెంచిన డీజిల్, పెట్రోల్, వంటగ్యాస్ ధరలను తగ్గించి జీవనోపాధి కల్పించాలని కోరారు. జీవో నంబర్లు 21, 31లను రద్దు చేసి రవాణా రంగాన్ని కాపాడాలని కోరారు. కార్యక్రమంలో రావికృష్ణ, బి.రామారావు, శ్రీను, రమణ, రాజా, వాసు, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

ముగిసిన సమ్మర్ క్యాంప్



సర్టిఫికెట్లతో విద్యార్థులు

సింహాచలం: వేపగుంట జిల్లా పరిషత్ హైస్కూల్‌లో నిర్వహించిన సమ్మర్ క్యాంపులో శిక్షణ పొందిన విద్యార్థులకు సోమవారం సర్టిఫికెట్ల ప్రదానోత్సవం జరిగింది. యానిసెఫ్, నీతి అయోగ్ సంస్థల ఆధ్వర్యంలో పాఠశాలలో అటల్ టింకరింగ్ ల్యాబ్‌లో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. టూల్స్, క్యాడ్, త్రీడీ ప్రింటింగ్, బేసిక్ ఎలక్ట్రానిక్స్, అడ్వాన్స్‌డ్ ఎలక్ట్రానిక్స్‌పై పూణె విజ్ఞాన ఆశ్రమం నుంచి వచ్చిన నిపుణులు అవినాష్, వెంకటేష్ శిక్షణ ఇచ్చారు. విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పద్మావతి తదితరులు పాల్గొన్నారు.